క్లుప్తంగా

తెలుగుపై పరిజ్ఞానం అవసరం



విద్యార్థులకు గణిత సమీక్ష వివరిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దాపురం: తెలుగు భాష, తెలుగుతనంపై విద్యార్థుల బాల్యం నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం తెలుగు పద్యాలు, నీతి కథలు, గణితం, పుస్తక సమీక్ష వంటి అంశాలపై సుమారు 30 మంది విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజాను కలిసిన నేతలు



రాజాతో భూషణం, రాజేష్, బాబీ

పిఠాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఉలవల భూషణం, కాకినాడ జిల్లా అధికార ప్రతినిధి పెదపాటి రాజేష్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి బాబీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వీరు ఆయనతో పార్టీ పటిష్టతపై సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం యువతను సిద్ధం చేయాలన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాయకులను ఆయన ఘనంగా సత్కరించారు.

నిరుపయోగంగా తొట్టెలు



వీకే రాయపురంలో ఖాళీగా ఉన్న నీళ్ల తొట్టె

సామర్లకోట: వేసవి కాలంలో పశువులకు నీళ్ల కోసం నిర్మించిన నీళ్ల తొట్టెలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఉపాధి పథకంలో భాగంగా పశువులు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశాలలో వీటిని నిర్మించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే గ్రామంలో వీటిని నిర్మించాల్సి ఉంది. అయితే వీకే రాయపురం ఏలేరు కాలువ గట్టుకు రెండు వైపులా నీటి తొట్టెలు నిర్మించినా వాటిలో నీరు పోసేవారు కరువయ్యారు. ప్రతి గ్రామంలో పశువుల సంఖ్య ఆధారంగా నీళ్ల తొట్టెలను నిర్మించి వాటికి తెలుగుదేశం రంగులు వేసుకున్నారు. కాగా వీకే రాయపురంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన ఖాళీ నీళ్ల తొట్టె ఇలా వెక్కిరిస్తూ కనిపిస్తోంది.

సైకిల్‌తో ఆరోగ్య జీవనం



స్లో సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: అన్ని వయసుల వారి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, వ్యాధులను నివారించడానికి, చక్కని జీవనశైలికి నిత్యం సైకిల్ తొక్కాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోటార్ సైకిల్ కొనలేని పేదవారి వాహనం సైకిల్ అన్నారు. అయితే ఇటీవల ధనవంతులు కూడా ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుతున్నారన్నారు. సైకిల్ తొక్కడం వల్ల గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లు, మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాలు రాకుండా నివారించవచ్చన్నారు. సరళమైన, సరసమైన, శుభ్రమైన, పర్యావరణానికి సరిపడే స్థిరమైన రవాణా సాధనం సైకిల్ అని తెలిపారు. అందరూ సైకిల్ తొక్కడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు పెట్రోల్ ఖర్చు కూడా ఉండదన్నారు. సమాజంలో సైకిల్ సంస్కృతిని పెంపొందించడానికి ప్రపంచ సైకిల్ దినోత్సవం జరుపుకొంటున్నామని డాక్టర్ అడ్డాల తెలిపారు. అనంతరం స్లో సైక్లింగ్‌లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదంతా వెన్నుపోట్లే!

- కూటమి ప్రభుత్వం చేసిన గాయం
- నిరసనలకు సమాయత్తం
- భారీ ఏర్పాట్లు చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ప్రజల నుంచి అనూహ్య స్పందన



వెన్నుపోటు దినం కార్యాచరణపై నాయకులతో సమీక్షిస్తున్న వంగా గీత

పిఠాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. కాని వారు ఇచ్చిన హామీలన్నీ నీటిమీద రాతలుగా మారిపోయాయి. ఏ ఒక్కటీ అమలు కాక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీగా వారి తరపున పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధమైంది. ప్రజల నుంచి సైతం ఈ పోరాటానికి అనూహ్య స్పందన రావడంతో బుధవారం వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమాలకు పార్టీ పిలుపునిచ్చింది.

దీనిపై ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు. నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతో పాటు పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీలకు చెందిన నాయకులతో సమీక్షించిన ఆమె వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

కార్యక్రమం ఇలా..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన వెన్నుపోటు దినంలో భాగంగా పిఠాపురం పట్టణం రాజావారి కోటలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. పార్టీ శ్రేణులు ముందుగా ఈ కార్యాలయం వద్దకు చేరుకుని, అక్కడి నుంచి ప్రజలతో కలసి ప్రదర్శనగా 9 గంటలకు పిఠాపురం పట్టణానికి (ఉప్పాడ సెంటర్) చేరుకుంటారు. అక్కడి నుంచి శాంతియుత ర్యాలీగా పిఠాపురం పట్టణ తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలుపరిచి ప్రజలకు అందించాలని, రాష్ట్ర వైఎస్సార్ సీపీ అదేశానుసారం తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరూ ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎంపీ వంగా గీత పిలుపు నిచ్చారు.

గ్రామాల వారీగా ఏర్పాట్లు..

వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఉలవల భూషణం, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెదపాటి రాజేష్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి బాబీ, పిఠాపురం పట్టణ, మండల, గొల్లప్రోలు నగర పంచాయతీ, మండల, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షులు రావుల మాధవరావు, అడపా రఘు, మైనం రాజా, అరిగెల రామయ్యదొర, ఆనాల సుదర్శన్ మండలాల వారీగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వీరితో పాటు పార్టీ యూత్ వింగ్ అధ్యక్షుడు దాసం వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతుల వాణి, రైతు విభాగం నుంచి గొల్లపల్లి సర్వారాయుడు, బీసీ సెల్ నుంచి పితాని కాశీ విశ్వనాథ్, ఎస్సీ సెల్ నుంచి పెదపాటి రమేష్ కుమార్, ఎస్టీ సెల్ నుంచి సింగం నాగేశ్వరరావు, మైనార్టీ సెల్ నుంచి సయ్యద్ మొహిద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ నుంచి సందక శ్యామలరావు, స్టూడెంట్ వింగ్ నుంచి నల్లమిల్లి పవన్ కుమార్, పంచాయతీ రాజ్ వింగ్ నుంచి కరీన్డి సత్యనారాయణ, మున్సిపల్ వింగ్ నుంచి గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, ఆర్టీఐ వింగ్ నుంచి పచ్చిమళ్ల అప్పలరాజు, వలంటీర్ల వింగ్ నుంచి గుల్లపల్లి గణేష్, గ్రీవెన్స్ సెల్ నుంచి నేతల సురేష్ కుమార్, వాణిజ్య విభాగం నుంచి వర్ధినీడి శ్రీనివాస్, వీవర్స్ వింగ్ నుంచి గోపి హరిబాబు, వైఎస్సార్ టీయూసీ నుంచి గింజాల రామకృష్ణ, అంగన్‌వాడీ వింగ్ నుంచి నరకుర్తి వెంకటలక్ష్మి, లీగల్ సెల్ నుంచి నల్లా రాజశేఖర్, కల్చరల్ వింగ్ నుంచి వేణుం నారాయణరావు, సోషల్ మీడియా వింగ్ నుంచి బోడపాటి రాజేష్, ఐటీ వింగ్ నుంచి కందా దీప్తి, డాక్టర్స్ వింగ్ నుంచి రంది కృష్ణ, ఇంటలెక్చువల్ ఫోరం నుంచి వడిశెట్టి సత్యనారాయణ రెడ్డి, బూత్ కమిటీ వింగ్ నుంచి కొత్తెం పశువుల రావు, పబ్లిసిటీ వింగ్ నుంచి గ్రంధి గణేష్ తదితరులు గ్రామాలు, వార్డుల వారీగా తరలివచ్చే ప్రజలకు నాయకత్వం వహించేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పిఠాపురం పార్టీ కార్యాలయం వద్ద వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

సరఫరాకు అంతరాయం



విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న గ్యాస్ సిలిండర్ల లారీ

సామర్లకోట: ఇరుకు రోడ్లలో భారీ వాహనాల రాకపోకల వల్ల తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. స్థానిక ఇండస్ట్రియల్ రోడ్డులో పశువుల ఆస్పత్రి సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న గ్యాస్ సెలెండర్ల లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దాంతో సిమెంటు స్తంభం ఒరిగిపోయి ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఏపీ ఈపీ డీసీఎల్ ఏఈ రమేష్‌కుమార్ హుటాహుటిన ఘటనా ప్రదేశానికి చేరుకుని విద్యుత్తు స్తంభాన్ని మార్చి సరఫరాను పునరుద్ధరించారు.

మెహర్ కాంప్లెక్స్ నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ మీదుగా భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు ఇరుకుగా ఉండటం, ప్రైవేటు కళాశాలలకు వచ్చే విద్యార్థులతో, పశువుల ఆస్పత్రికి వచ్చే పశువులతో నిత్యం రద్దీగా ఉంటుందని స్థానికులు తెలియజేస్తున్నారు.

ఉష్ణతాపంతో ఆపసోపాలు

- 41 డిగ్రీల ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలు
- వడగాడ్పులకు తట్టుకోలేక అవస్థలు



నిర్మానుష్యంగా ఉన్న వారధి

సామర్లకోట: మూడు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. మే నెలలో వర్షాలు కురియడంతో ప్రజలు ఊరట చెందారు. ఆ ఊరటను పూర్తిగా ఆస్వాదించకముందే భానుడు మళ్లీ ప్రచండ తాండవం చేసేస్తున్నాడు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు వేడి గాడ్పులతో ప్రజలు అల్లాడిపోయారు. దీనికి తోడు ఏదో ఒక సాకుతో విద్యుత్ సరఫరా నిలచిపోతుండడంతో ప్రజలు అల్లాడిపోయారు. స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపులలోనికి నేరుగా ఎండ వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో నిత్యం రద్దీగా ఉండే స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు కనిపించలేదు. చిన్నారులు, వృద్ధులు వడగాడ్పులకు తాళలేక అస్వస్థతకు గురవుతున్నారు. జూన్ 10 వరకు ఎండ తీవ్రత ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అప్పటి వరకు పెళ్లిళ్ల జోరు ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఎండ దెబ్బకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు వారి విధులు పూర్తి చేసుకోవడానికి, వివాహాలకు ఎండను లెక్కచేయకుండా వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు తెలియజేస్తున్నారు. దాంతో తలకు గుడ్డలు కప్పుకుని వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో వివిధ రకాల జ్యూస్‌లు, చెరుకు రసం, కొబ్బరి బొండాలకు డిమాండ్ ఏర్పడింది.

నాయకత్వం అనేది ఒక బాధ్యత



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పిఠాపురం: 'నాయకత్వం అనేది ఒక పదవి కాదు. అది ఒక బాధ్యత. ధైర్యంగా నమ్మకంగా ఉండడానికి ఎవరి అనుమతి అవసరం లేదు. మీ స్వరం ముఖ్యం. దాన్ని మంచి కోసం ఉపయోగించండి' అని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి బాలికలకు సూచించారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో నిర్వహించిన కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులలో ఆమె మాట్లాడారు. ధైర్యం అంటే భయం లేకపోవడం, భయం ఉన్నప్పటికీ ముందుకు సాగడమని కౌమార బాలికల నాయకత్వం సాధికారిత అంశాలపై కిశోరి బాలికలకు ఆమె అవగాహన కల్పించారు. తోటి వారి మద్దతు ప్రాముఖ్యత మార్గదర్శకత్వం, ఇతర బాలికలతో కలిసి ఎదగడానికి సహాయం చేయడం లాంటి అంశాలను ఆమె వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి మాట్లాడుతూ ఈ కిశోరి వికాసం బాలికల జీవన విధానంలో ప్రభావితం చూపుతుందని ప్రతి షెడ్యూల్‌లో వారి జీవన మనుగడకు ఉపయోగ పడే అంశాలు వివరిస్తూ బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల వయసు పూర్తి కాకుండా అమ్మాయికి, 21 ఏళ్లు నిండకుండా అబ్బాయికి వివాహం చేసినట్లయితే బాల్య వివాహంగా పరిగణించి వారిపై బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించి పిల్లల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే, లేదా బాల్య వివాహం జరుగుతుందని ఎవరికైనా సమాచారం తెలిసినా 1098కి లేదా 112కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై 1930కు సమాచారం ఇవ్వాలని ఆమె బాలికలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దాసం మణి, సంధ్యా రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కిశోరి బాలికలు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకునేవారేరీ?

- కొనుగోలుదారుల కోసం రైతన్న ఎదురుచూపు
- ముందుకు రాని మిల్లర్లు
- రూ.1200 ఇస్తామంటున్న దళారులు



కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న కౌలు రైతులు

సామర్లకోట: బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల వరుసగా కురిసిన వర్షాలకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పట్టణ పరిధిలోని భీమవరం దిగువ ప్రాంతంలోని భూములను రైతులు కౌలు చేసుకుంటున్నారు. వర్షాల వల్ల ఆ ప్రాంతంలోని వరి పంట పడిపోయి నీట మునిగి, ధాన్యం తడిసి మొలకలొచ్చిన విషయం తెలిసిందే. వాతావరణంలో మార్పులతో నాలుగు రోజులుగా ఎండలు విపరీతంగా కాయడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా బస్తాకు రూ.1,725 చెల్లించాల్సి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోళ్లకు ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు మోకా నాయుడు, పిట్టా రాజు, ఎడ్ల కోటయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు రూ.1,200 చెల్లిస్తామని చెప్తున్నారని కౌలు రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సహాయం అందజేయకపోగా పండించిన ధాన్యం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ రాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేశారని తెలిపారు. కౌలు రైతుల పరిస్థితిపై మండల వ్యవసాయాధికారి ఐ.సత్యను వివరణ కోరగా రైతులు ధాన్యం సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, ధాన్యం కొనుగోలు చేసే అధికారం తమకు లేదని, ఈ విషయాన్ని సివిల్ సప్లయ్ డీఎం దృష్టికి తీసుకువెళ్లి ధాన్యం కొనుగోలు చేసే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

సమ్మెను ఉధృతం చేస్తాం

- మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మిక సంఘ అధ్యక్షుడు ఉండవిల్లి
- ప్రభుత్వంతో చర్చలు విఫలం




కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

సామర్లకోట: తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెను ఉధృతం చేస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ కాంట్రాక్టు కార్మిక సంఘ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు అన్నారు. వారి సమస్యలపై గత నెల ఏడో తేదీ నుంచి చేస్తున్న సమ్మె మంగళవారం కూడా కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్మిక సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ నెలకు రూ.13 వేలు చేతికి వస్తే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు 15 ఏళ్లు దాటి పని చేస్తున్న వారిని పర్మెనెంట్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోతే రూ.10 లక్షలు, అంగవైకల్యం చెందితే రూ.ఐదు లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ సెలవులు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్‌ఏ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పట్టణమంతా వెలుగులు, మా బతుకులలో చీకటి, పట్టణ ప్రజలకు తాగునీరు, మాకు కన్నీళ్లు అంటూ నినాదాలు చేశారు. తమ సమ్మె ఉధృతంలో భాగంగా నిరాహార దీక్షలు చేయడానికి కూడా సిద్ధమేనని కార్మికులు ప్రకటించారు.

తాగునీరు ఆకుపచ్చగా..



తిమ్మాపురంలో ఆకుపచ్చరంగులో వస్తున్న కుళాయి నీరు



పండూరు నీటి పథకం నుంచి తిమ్మాపురానికి వస్తున్న నీరు

కాకినాడ రూరల్: కుళాయిల నుంచి ఆకుపచ్చ రంగులో తాగునీరు వస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో పలు గ్రామాలకు తాగునీటిని పండూరు సీపీడబ్ల్యూఎస్ పథకం నుంచి పంపిణీ చేస్తున్నారు. అక్కడ వాటర్ ఫిల్టర్లలో శుద్ధి చేసిన తరువాత రక్షిత జలాలను గ్రామాలలో ఓహెచ్‌ఆర్ ట్యాంకులకు అక్కడ నుంచి కుళాయిల ద్వారా పంపిణీ చేస్తున్నారు. మంగళవారం తిమ్మాపురం గ్రామంలో కుళాయి నీరు ఉదయం, సాయంత్రం సైతం ఆకుపచ్చ రంగులో రావడంతో గ్రామస్తులు సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సర్పంచ్ స్పందిస్తూ చెరువులో ఉన్న నీరు ఎలా ఉంటుందో అలాగే కుళాయిల ద్వారా వస్తున్నాయని, తాగునీరు శుద్ధి కావడం లేదన్నారు. వేసవిలో శుద్ధి చేయకుండా కుళాయి నీరు పంపిణీ చేస్తుండడంతో గ్రామస్తులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దృష్టికి సమస్యను తీసుకువెళ్లామన్నారు. సీపీడబ్ల్యూఎస్ పథకం వద్ద స్టోరేజీ ట్యాంకులో నీరు అడుగంటడంతో రంగు మారి వస్తున్నట్టు ఆయన తెలిపారన్నారు. పూర్తి స్థాయిలో శుద్ధి చేసిన నీటిని కుళాయిల ద్వారా అందించాలని కోరుతున్నామని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన కోరారు.

మిల్లర్ల సిండికేట్ దోపిడీ



పెద్దాపురం మండలం గోరింటలో నిరసన తెలియజేస్తున్న రైతులు

పెద్దాపురం: జిల్లాలోని రైస్ మిల్లర్లు ఒక సిండికేట్‌గా ఏర్పడి రైతుల పంటను అతి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ వారిని అథోగతి పాలు చేస్తున్నారని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆరోపించారు. మండలంలోని గోరింట గ్రామంలో మంగళవారం రైతు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రతి బస్తా ధాన్యంలో పది కేజీలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఒకపక్క ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగి, మరో పక్క ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తే, వారికి కనీస మద్దతు ధర కూడా లభించడం లేదన్నారు. దళారులను అరికట్టి ప్రభుత్వమే నేరుగా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘ నాయకులు మాదిరెడ్డి తాతయ్య, కర్రి శ్రీను, మిరియాల రామకృష్ణ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



సౌమ్య

కరప: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.సునీత మంగళవారం రాత్రి తెలిపారు. మండలం కొంగోడు గ్రామానికి చెందిన ఆట్ల సుబ్బరాజు భార్య సౌమ్య మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటిలో కోపగించి బయటకు వచ్చేసింది. పరిసర గ్రామాల్లో, బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు కరప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96557, 94407 96521 నంబర్లకు ఫోన్‌చేసి, సమాచారం అందించాలని ఎస్ఐ సునీత కోరారు.

కాపులను ద్రోహులుగా చూడడం తగదు

బోట్‌క్లబ్: కాపులను ద్రోహులుగా చూడడం తగదని ఆంధ్రకాపు సద్భావన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సుమారు తొమ్మిదేళ్ల క్రితం జరిగిన తుని రత్నాచల్ రైలు దగ్ధం దుర్ఘటన రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో సంచలనం కలిగించిందన్నారు. దీనితో సంబంధంలేని పలువురు కోర్టుల చుట్టూ తిరిగి ఎంతో ఆవేదనకు గురయ్యారన్నారు. ఈ దుర్ఘటనలో ఎవరో విద్రోహులు ఉండవచ్చునన్నారు. కాపులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే అధ్యయన కమిటీ వేసి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ



పీఎం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కాకినాడ పీఎం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతతో మంచి మార్కులు సాధించిన దేవ్‌హాసన్, స్నేహాశరణ్య, కె భానుసూర్యశ్రీ, జి.హాసినిలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోను కొనసాగి పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.

జీవో ఉపసంహరణ హర్షణీయం

కాకినాడ రూరల్: కాపు రిజర్వేషన్ కోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగా తునిలో ఉత్పన్నమైన రైలు దహనం కేసును ఉపసంహరించుకుంటూ 869 జీఓ జారీ చేయడంపై కాపు సంఘ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కాకినాడలోని శుభం కాపు కల్యాణ మండలంలో మంగళవారం సాయంత్రం కాపు సద్భావన సంఘం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ నేత వాసురెడ్డి ఏసుదాసు మాట్లాడుతూ కాపులు చాలా మృదు స్వభావులని, తుని కేసులకు సంబంధించి అప్పీల్‌పై పునరాలోచించి ఉపసంహరించుకున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. రత్నాచల్ దహనం కేసులో కాపులు నిందితులు కాదని, అసలు నిందితులు ఎవరో తేల్చాలని కోరుతున్నామన్నారు. కాపులకు 5 శాతం రిజర్వేషన్ కోసం పోరాటానికి కార్యాచరణ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాపు సద్భావన సంఘ నేతలు గొల్లపల్లి లక్ష్మణరావు, జొన్నాడ వెంకటరమణ, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.